సిరిసిల్ల అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా

రాపెల్లి లక్ష్మీనారాయణ

అడ్డగట్ల మురళి

- చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు కైవసం
- చైర్మన్‌గా రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్‌గా మురళి ఏకగ్రీవం

రాజన్న సిరిసిల్ల, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 12 డైరెక్టర్ స్థానాల్లో 8 స్థానాలను గెలుచుకోగా, శుక్రవారం బ్యాంకు కార్యాలయంలో చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా చైర్మన్ స్థానానికి రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ స్థానానికి అడ్డగట్ల మురళి నామినేషన్ దాఖలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు బలపరిచిన అభ్యర్థుల నుంచి నామినేషన్ దాఖలు కాలేదు. సింగిల్ డిజిట్ నామినేషన్ దాఖలు కావడంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు అధికారులు ప్రకటించారు. సహకార సంఘాలలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు మూడుసార్లు గులాబీ పార్టీ అభ్యర్థులకే ఓటర్లు పట్టంకడుతూ వస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. సహకార రంగంలో దేశంలోనే ఖ్యాతి గడించిన సిరిసిల్ల సహకార విద్యుత్తు సంస్థలో 2022 డిసెంబర్‌లో జరిగిన పాలకవర్గ ఎన్నికల్లోనూ 15 స్థానాలకు 15 బీఆర్ఎస్ గెలుచుకున్నది. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ ఎన్నికల్లోనూ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఓటర్లు పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. గురువారం జరిగిన అర్బన్ బ్యాంకు ఎన్నికల్లోనూ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి కేటీఆర్‌పై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికైన అభ్యర్థులకు కేటీఆర్ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

విజయోత్సవ సంబురాలు

చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ విజయోత్సవ సంబురాలు జరిపింది. చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను ఒకే వాహనంపై సిరిసిల్ల పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించింది. గెలిచిన అభ్యర్థులందరికీ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రాంమోహన్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ గాజుల నారాయణ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రిటైర్డ్ అధికారుల రిటైన్

- నాడు వద్దన్న రేవంతే నేడు నియామకాలు
- నాటి ప్రభుత్వంపై విమర్శలు
- ఇరిగేషన్ శాఖ సలహాదారుగా ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యనాథ్‌దాస్
- నార్కోటిక్స్‌కు రిటైర్డ్ ఐపీఎస్ సందీప్ శాండిల్య
- త్వరలోనే మరి కొంతమంది రాష్ట్ర ప్రభుత్వంలోకి!

> పదవీ విరమణ చేసిన పోలీస్, ఐఏఎస్ అధికారులను తిరిగి ప్రభుత్వంలో నియమించటం దారుణం. కేసీఆర్ ప్రభుత్వం తక్షణం ఇలాంటి అధికారులను తొలగించాలి. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. రిటైర్డ్ అధికారులను ప్రభుత్వం వెంటనే తొలగించాలి.
>
> - పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్ చేసిన వ్యాఖ్యలివి (2020 జూన్ 25న)

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కారు నిర్ణయాలు తప్పని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే రిటైర్డ్ అధికారులకు తన ప్రభుత్వంలో చోటు కల్పిస్తున్నారు. వాస్తవానికి రిటైర్ అయ్యే ప్రభుత్వ కొలువుల్లో కొనసాగుతన్నవారిని పంపించేస్తారని అంతా భావించారు. ప్రభుత్వ పెద్దలు కూడా ఓఎస్డీలుగా, ఇతర హోదాల్లో పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగిస్తున్నట్టు మీడియాకు లీకులు ఇచ్చారు. సీఎస్ శాంతికుమారి ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చి శాఖలవారీగా ఈ జాబితాను తెప్పించారు. కానీ, ఆరు నెలలుగా ఆ జాబితా అటకెక్కింది. అంతేకాదు.. రిటైర్ అయిన మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తాజాగా ప్రభుత్వ పదవుల్లో చేరుతున్నారు. ఒకరో ఇద్దరో కాదు.. భారీగానే పదవీ విరమణ చేసిన వారికి పెద్దపీట వేయాలని కాంగ్రెస్ సర్కారు ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల కోడ్ ముగిసిన మరుక్షణమే ఉత్తర్వులు వెలువడటం మొదలైంది. శుక్రవారం రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌కు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నీటిపారుదల శాఖ సలహాదారుగా ఏపీ మాజీ సీఎస్

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జలయజ్ఞం ప్రాజెక్టుల రూపకల్పన, అమలులో కీలకంగా వ్యవహరించి, రాష్ట్ర విభజన తర్వాత ఏపీ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సీఎస్‌గా వ్యవహరించిన ఆదిత్యనాథ్‌దాస్‌ను రేవంత్ ప్రభుత్వం తెలంగాణకు తీసుకొచ్చింది. నీటిపారుదలశాఖ సలహాదారు పదవిని ఆయనకు కట్టబెట్టింది. ఆదిత్యనాథ్‌దాస్ తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకి అన్న పేరు ఉన్నది. నాటి జలయజ్ఞం ప్రాజెక్టుల పనుల్లో ఆయన కీలకంగా ఉన్నారు. ఏపీ ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీళ్లు తీసుకోవటంలో ఆయన ప్రమేయంతో పాటు , తెలంగాణ ప్రాజెక్టులపై కేసులు వేయించి పనులు ఆపివేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. గత పదేండ్లు కూడా ఏపీ నీటిపారుదల రంగంలోనే పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ నీటిపారుదల శాఖకు సలహాదారుగా ఆయనను తెచ్చిపెట్టడంపై తెలంగాణ నీటిపారుదల ఇంజినీర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఆయన కాపాడుతారో లేదో అన్న అనుమానం వ్యక్తమవుతున్నది.

సందీప్ శాండిల్యకు నార్కోటిక్స్ బాధ్యతలు

ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యకు తిరిగి నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన మే 31న పదవీ విరమణ చేశారు. నార్కోటిక్స్ బ్యూరోలో పనిచేసే సమర్థులు చాలామందే ఉన్నా, ప్రభుత్వం ఆయనకే మరోసారి బాధ్యతలు అప్పగించింది. పదవీ విరమణ చేసిన పోలీసులను ప్రత్యేకంగా నియమించటం ఏమిటని రేవంత్ అనేక సందర్భాల్లో ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే రిటైర్డ్ పోలీసులను తిరిగి పోస్టుల్లోకి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే మరో అధికారి కూడా రిటైర్ కాబోతున్నారు. బలమైన సామాజిక వర్గానికి చెందిన ఆయనకు కూడా సర్వీస్ ఎక్స్‌టెన్షన్ లభిస్తుందని పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

అసెంబ్లీకి అడ్వైజర్

కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే శాసనసభకు సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను సలహాదారుగా నియమించారు. అయితే, అప్పటికే శాసనసభ సెక్రటరియట్‌కు పదవీ విరమణ చేసిన నరసింహాచార్యులు ఎక్స్‌టెన్షన్‌పైనే కొనసాగుతున్నారు. ఏడేండ్లకు పైగా ఎప్పటికప్పుడు ఎక్స్‌టెన్షన్ పొందుతున్న నరసింహాచార్యులపై కొత్తగా సలహాదారును తీసుకొచ్చిపెట్టారు. శాసనసభ వ్యవస్థలో రెగ్యులర్ సెక్రటరీని ఎప్పుడు నియమిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రిటైర్డ్ అధికారుల రిటైన్‌పై విమర్శించిన రేవంత్.. ఇప్పుడు దాన్నే కొనసాగిస్తుండటం విచిత్రం.

బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేయండి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచు తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత రిజర్వేషన్లతోనే ఎన్నికల జరిపితే ఖబడ్దార్ అంటూ శుక్రవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. బీసీలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని తెలిపారు. అధికారం వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ కులగణన అని చెప్పి కేవలం అసెంబ్లీ తీర్మానంతోనే ప్రభుత్వం సరిపెట్టిందని విమర్శించారు. ఈ విషయంలో బీసీ కమిషన్ ఇప్పటివరకు ఏమి చేసిందో ఎవరికీ తెలియదదని, బీసీ సబ్‌ప్లాన్ జాడే లేదని తెలిపారు. స్థానిక సంస్థలకు 42% రిజర్వేషన్ అమలుకు చట్టపరమైన అడ్డంకులేమీ లేవని అభిప్రాయపడ్డారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 54 శాతంగా ఉన్నట్టు తేలిందని, దాని ఆధారంగానైనా బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ముందు ఒక ఆర్డినెన్సు జారీ చేయాలని, తర్వాత చట్టం తేవచ్చని సూచించారు. 'మళ్లీ సమయం లేదంటూ బుకాయిస్తూ పాత రిజర్వేషన్లు అయిన 23 శాతంతోనే ఎన్నికలు జరిపి బీసీలను మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ నేతల బతుకులు పల్లేర్తెయ్ ఖబడ్దార్.' అంటూ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

'నీటిని కొల్లగొట్టేందుకే ఆదిత్యనాథ్‌కు పదవి'

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణను ఎండబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. సీఎం పదవిలో ఉండి రాష్ట్ర నీటి హక్కులను పొరుగు రాష్ట్రానికి అప్పజెప్పేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మన నీళ్లను ఆంధ్రోళ్ల చేతుల్లో పెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే తెలంగాణ ఇరిగేషన్ సలహాదారుడిగా ఆదిత్యనాథ్‌దాస్‌ను నియమించారని ధ్వజమెత్తారు. తెలంగాణకు వ్యతిరేకంగా ఆదిత్యనాథ్‌దాస్ అనేకసార్లు కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రాజెక్టులపై రాతపూర్వక ఫిర్యాదులు చేశారని వెల్లడించారు. అలాంటి వ్యక్తిని రాష్ట్ర జలవనరులకు సలహాదారుగా నియమించడం దారుణమని మండిపడ్డారు. ఇది తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమే అని అభివర్ణించారు. తెలంగాణను శాశ్వతంగా బీడుగా మార్చేందుకు, మన నీళ్లను ఆంధ్రాకు అప్పగించబోతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ కావాలని చంద్రబాబు కోరుతున్నారన్నారు. అదే జరిగితే.. అక్కడ గురువు, ఇక్కడ శిష్యుడు తెలంగాణ నీళ్లను మింగేయటం పక్కా అని అనుమానం వ్యక్తంచేశారు.

ఏ కూటమిలో లేని పక్షాలకు చేదుఅనుభవం

- కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని ప్రాంతీయ పార్టీల అణచివేత
- కేసీఆర్‌తో బీఆర్ఎస్ ముఖ్యనేతల భేటీలో అభిప్రాయం

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): జతకట్టని ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని పథకం ప్రకారం అణచివేశాయన్న అభిప్రాయం బలపడుతున్నది. కలిసివస్తే చెయ్యి అందిస్తాం.. లేకపోతే ఖతం చేస్తాం అనే ధోరణితో రెండు జాతీయ పార్టీలు పోటీపడి ప్రాంతీయ పార్టీలపై విషప్రచారం చేశాయని, దురదృష్టవశాత్తు వాటి కుయుక్తులే విజయం సాధించాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్డీయే, ఇండియా కూటములు తమ రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పనిచేశాయి తప్ప వేరే లక్ష్యం లేదని రాజకీయ పండితులు ఆరోపిస్తున్నారు. తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో కూటమితో కలవకుండా ఒంటరిగా పోటీ చేసిన ప్రాంతీయ పార్టీలకు చేదు అనుభవం ఎదురైందన్న వాదన వినిపిస్తున్నది. బీఆర్ఎస్ సైతం ఏదో ఒక కూటమిలో చేరితే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వేరేలా ఉండేవన్న అభిప్రాయాలు ఆ పార్టీలో వ్యక్తమవుతున్నాయి. పార్టీ ముఖ్యనేతలు, ఉద్యమకారులు, మేధావులు.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో జరిపిన సమాలోచనల సందర్భంగా ఇదే విషయం వెల్లడైనట్టు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ విస్తృతంగా సమాలోచనలు జరుపుతున్నారు. శుక్రవారం కేసీఆర్‌ను పలువురు నాయకులు కలిసి పలు అంశాలపై చర్చలు జరిపినట్టు తెలిసింది. 'తెలంగాణకు బీఆర్ఎస్ రక్షణ కవచం.. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల యోగక్షేమాలే పరమావధిగా పార్టీ పనిచేస్తుంది. ఎన్నికల్లో గెలుపు ఒక్కటే రాజకీయం కాదు' అని కేసీఆర్ అన్నట్టు తెలిసింది. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీమంత్రి సబిత, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, నడిపల్లి దివాకర్‌రావు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, పార్టీ సీనియర్ నేతలు పటోళ్ల కార్తీక్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలి

హైదరాబాద్, జూన్7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేయడంతోపాటు, బీహార్‌లో బీసీ రిజర్వేషన్లను 60 శాతానికి పెంచారని, తమిళనాడులో 70 శాతానికి పెంచారని, పార్లమెంటులో అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లను పెంచినప్పుడు 50 శాతం సీలింగ్ తొలగించారని, సుప్రీంకోర్టు కూడా దానిని సమర్థించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కులగణన చేసి జనాభా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని మంత్రిని కోరారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన బీసీ నేతల్లో గుజ్జ కృష్ణ, గోరేగె మల్లేశ్‌యాదవ్, నీలం వెంకటేశ్, రామకృష్ణ, అనంతయ్య, వంశీకృష్ణ, కృష్ణమూర్తి, ఉదయ్‌నేత, శివకృష్ణ, బలరామ్‌నాయక్, పర్వతాలు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

రాహుల్ ప్రధాని కాకుండా చేసింది రేవంతే

- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు

ఖైరతాబాద్, జూన్ 7: 'రాహుల్‌ను ప్రధాని కాకుండా అడ్డుకున్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయనకు కుల రాజకీయాలు ఎక్కువయ్యాయి.. ఆర్థికంగా ఉన్న ఆయన సామాజికవర్గాలకే ప్రాధాన్యమినిస్తున్నారు' అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో సీఎం వైఖరిని ఖండించారు. 80 లక్షల జనాభా ఉన్న మాదిగలు, 60 శాతం ఉన్న బీసీలను కాదని ఆయన సామాజిక వర్గానికి చెందిన, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ఏడు పార్లమెంట్ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. ఆయన తప్పుడు నిర్ణయాలతో తెలంగాణలో 16 సీట్లు గెలువాల్సిందిపోయి, ఎనిమిదికే సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. తన స్వస్థలమైన మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలిచారని, ఆయన ఎంపీగా గెలిచిన మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందారని, సొంత నియోజకవర్గాలనే కాపాడుకోలేని వ్యక్తి సీఎంగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లు వేసి గెలిపించారని రేవంత్‌రెడ్డి అంటున్నారని, అలాంటప్పుడు ఆ పార్టీ పదహారు సీట్లు ఎందుకు గెలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు సీట్లు రాకపోవడానికి రేవంతే కారణమని, రాహుల్, సోనియా గుర్తించాలని చెప్పారు.

ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించండి

- ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగిరం చేయాలి
- ప్రభుత్వ దవాఖానల ధరలకే ఆరోగ్యశ్రీ
- ప్రైవేట్ దవాఖానలను ఒప్పించండి
- అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం
- పలు శాఖల అధికారులతో భట్టి రివ్యూ
- హాజరైన మంత్రులు పొంగులేటి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్

సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో రెవెన్యూకు సంబంధించిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, ఆరోగ్యశ్రీ విభాగాల పనితీరును ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశంలో ఆయా శాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా గత రెండు ఆర్థిక సంవత్సరాల ప్రగతిని సమీక్షించారు. ఆ తర్వాత బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు నెలలు కనబరిచిన పనితీరుపై ఆరా తీశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్ట పరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో నియమించిన కమిటీ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ టాక్స్ విభాగాల్లో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్టీసీ సంస్థ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేట్లను సమీక్షించి, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలను బదలాయించాలని సూచించారు. ఇటీవల సింగరేణి సంస్థలో చేసిన ఈ ప్రయోగం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ప్రక్రియను వేగవంతం చేసి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలని కోరారు. పూర్తిగా అర్హత ఉన్న స్థలాలకే ఎల్ఆర్ఎస్ అమలుచేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఈ పథకం కింద ప్రయోజనం పొందే ప్రమాదం పొంచి ఉన్నదని హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇండ్లు, వచ్చిన ఆదాయం వంటి వివరాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే విక్రయించని ఇండ్లు, ఇండ్ల స్థలాలు, వాటి పరిస్థితిని సమీక్షించారు.

ప్రైవేట్‌లోనూ ప్రభుత్వ ధరలకే ఆరోగ్యశ్రీ

రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యుడు సంతృప్తి చెందడమే ప్రధాన లక్ష్యమని భట్టివిక్రమార్క స్పష్టంచేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారి చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో అమలుచేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రైవేట్ దవాఖానల్లో ఆయా చికిత్సలు అందించేందుకు వారిని ఒప్పించాలని, ఈ దిశగా చర్చలు జరపాలని అధికారులను కోరారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ తోరణం తొలగింపుపై నిర్ణయం తీసుకోలేదు

మీడియాతో మంత్రి కొండా సురేఖ

హనుమకొండ చౌరస్తా, జూన్ 7: ప్రభుత్వ చిహ్నం నుంచి కాకతీయ తోరణాన్ని తొలగిస్తున్నామని ఎక్కడా చెప్పలేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఆమె హనుమకొండలో మాట్లాడుతూ.. రాజముద్రలో కీర్తి తోరణం తొలగించలేదని, ఇంకా పరిశీలనలో ఉన్నదని తెలిపారు. క్యాబినెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందరితో చర్చిస్తున్నారని, అందరి నిర్ణయం మేరకే ముందుకెళ్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలను రెఫరెండమ్‌గా తీసుకున్నామని, ఆరు స్కీంలను అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, శ్రీహరి, నాగరాజు పాల్గొన్నారు.

ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్

- నేటి సాయంత్రం సీడబ్ల్యూసీ సమావేశం
- మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ పదవులపై చర్చ
- సీఎంగా 14వ సారి రేవంత్ పర్యటన

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. శనివారం సాయంత్రం జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం వెంట పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీడబ్ల్యూసీ సభ్యుడు, మంత్రి దామోదర రాజనరసింహ, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి కూడా ఉన్నారు. కొత్త ఎంపీలకు సైతం ఆహ్వానం అందింది. వీరికి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఢిల్లీ వెళ్లడం ఇది 14వ సారి కావడం గమనార్హం. ప్రస్తుతం సీఎం, టీపీసీసీ అధ్యక్ష పదవుల్లో రేవంత్‌రెడ్డే ఉన్నారు. టీపీసీసీకి కొత్త అధ్యక్షుడి ఎంపికలో సామాజిక సమీకరణలను పార్టీ పెద్దలకు రేవంత్‌రెడ్డి వివరించనున్నారని సమాచారం. సీఎం పోస్టు అగ్రవర్ణాలకు, డిప్యూటీ సీఎం, స్పీకర్ పోస్టు ఎస్సీ సామాజిక వర్గానికి ఇవ్వడంతో టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు నేతల ద్వారా తెలిసింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రేసులో ఉన్నట్టు సమాచారం. వీరు ముగ్గురు గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా అధిష్ఠానం మరో సామాజిక వర్గానికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. మైనార్టీ వర్గానికి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎస్సీ సామాజిక వర్గం నుంచి అద్దంకి దయాకర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి.

మంత్రివర్గ విస్తరణపై చర్చకు అవకాశం

ప్రస్తుతం సీఎంతో కలిపి 12 మంది మంత్రివర్గంలో ఉన్నారు. ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ఇంకా ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేలు ఎవరూ లేకపోవడంతో మంత్రివర్గంలో స్థానం కల్పించలేదు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి శ్రీగణేశ్ గెలువగా ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా? అన్న చర్చ జరుగుతోంది. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఇప్పటిదాకా మైనార్టీలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో తనకు అవకాశం కల్పిస్తారని నాంపల్లి నుంచి పోటీచేసి ఓడిపోయిన ఫిరోజ్‌ఖాన్ గంపెడాశతో ఉన్నారు. ఇక భువనగిరి ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే తనకు మంత్రి పదవి వస్తుందని మనుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బాహాటంగానే ప్రకటించారు. ఇప్పటికే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉండటంతో ఒకే కుటుంబానికి రెండో మంత్రి పదవి ఇవ్వడం కష్టమని పార్టీ వర్గాల్లో చర్చనడుస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సైతం మంత్రి పదవి ఇస్తామని సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలైన నేపథ్యంలో శ్రీహరికి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారా? అన్నది అనుమానమే!. ఎంపీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు 37 నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినట్టు ప్రకటించారు. కోడ్ రావడంతో ఉత్తర్వులు జారీ చేయలేదు. ఇప్పటికే ప్రకటించినవాటితో పాటు మరో 13 పోస్టుల భర్తీకి అధిష్ఠానం నుంచి అనుమతి పొందనున్నారని సమాచారం.

మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు ఊరట

హైదరాబాద్,జూన్7(నమస్తేతెలంగాణ): నిజామాబాద్ జిల్లా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్) పక్కదారి పట్టిన కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మహమ్మద్ షకీల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. చట్టప్రకారం సీఆర్‌పీసీ 41ఏ నిబంధనలు పాటించాలని పోలీసులను ఆదేశించింది. పిటిషనర్లకు 41 ఏ నోటీసులు జారీ చేసి, ఆ తర్వాత దర్యాప్తు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. విచారణను 21కి వాయిదా వేసింది.

మత్స్యకార చైర్మన్‌ను ఎలా నియమించారు: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని జిల్లాల మత్స్యకార సొసైటీలకు ఎన్నికలు పూర్తికాకుండానే మత్స్యకార సొసైటీ రాష్ట్ర చైర్మన్‌ను ఎలా నియమించారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.సాయికుమార్‌ను రాష్ట్ర మత్స్య సొసైటీ చైర్మన్‌గా నియమించారంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం విచారించగా, మళ్లీ 21కి వాయిదా వేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న

- మ్యాజిక్ ఫిగర్ రాకపోయినా వరించిన విజయం
- చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన రాకేశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జూన్ 7 (నమస్తే తెలంగాణ)/నీలగిరి: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎన్నికయ్యారు. బుధవారం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రి ముగిసింది. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. తొలి రోజు చేపట్టిన తొలి ప్రాధాన్యం ఓట్లలో తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు రాగా, రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు లభించాయి. గెలుపునకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 1.55,095 ఓట్లను ఎవరూ సాధించకపోవడంతో గురువారం అర్ధరాత్రి నుంచి ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్యం ఓట్లను లెక్కించారు. బరిలో 52 మంది అభ్యర్థులు ఉండగా, తొలుత తక్కువ ఓట్లు సాధించినవారిని ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్యం ఓట్లను లెక్కించారు. 47వ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్ ఎలిమినేట్ అయ్యే వరకు తీన్మార్ మల్లన్నకు 1,24,899 ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 105,524 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 30,461 ఓట్లు లభించాయి. అనంతరం బక్క జడ్సన్, అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ పూర్తయిన తరువాత కూడా ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోటాకు కొద్దిదూరంలో ఆగిపోయారు. అనధికార లెక్కల ప్రకారం మల్లన్నకు 1.50 లక్షల ఓట్లు, రాకేశ్‌రెడ్డికి 1.34 లక్షల ఓట్లు లభించినట్టు సమాచారం. దాంతో చివరలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని కూడా ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్యం ఓట్లను మల్లన్నకు పంచారు. అలా మల్లన్న మ్యాజిక్ ఫిగర్ 1,55,095 ఓట్లను చేరుకోవడంతో ఎన్నికల అధికారులు ఆయనను విజేతగా ప్రకటించారు. అనంతరం తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ.. తన విజయం సమిష్టి కృషి ఫలితమని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరిస్తానని చెప్పారు.

గట్టి పోటీ ఇచ్చిన రాకేశ్‌రెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆది నుంచి గట్టి పోటీ ఇచ్చారు. తొలి ప్రాధాన్యం ఓట్ల లెక్కింపులో తొలి మూడు రౌండ్లలో తీన్మా ర్ మల్లన్న ఆధిక్యంలో ఉంటే నాలుగో రౌండ్‌లో రాకేశ్‌రెడ్డి స్వల్ప ఆధిక్యం ప్రదర్శించారు. తర్వాత అశోక్ కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ సత్తాచాటారు. అశోక్ ఎలిమినేషన్‌లో ద్వితీయ ప్రాధాన్యం ఓట్లలో మల్లన్నకు 200 పైచిలుకు ఓట్ల ఆధిక్యం లభించగా, బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ రౌండ్‌లో రాకేశ్‌రెడ్డి సుమారు 5 వేల ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి సబ్ పార్సిల్ ఓట్లలోనూ పోటాపోటీగా ఓట్లను సాధించారు. ఓట్ల లెక్కింపులో ఉత్కంఠ కొనసాగింది. రాకేశ్‌రెడ్డిని ఎలిమినేట్ చేస్తే తప్ప మల్లన్నకు గెలుపు కోటా రాకపోవడం గమనార్హం.

నైతిక విజయం నాదే: రాకేశ్‌రెడ్డి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో సాంకేతికంగా ఓడినప్పటికీ నైతిక విజయం తనదేనని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో 32 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు ఉన్నప్పటికీ తాను గట్టి పోటీ ఇచ్చానని చెప్పారు. బీఆర్ఎస్ పనైపోయిందని విమర్శిస్తున్నవారికి ఇది కనువిప్పు అని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా తనకు ఓట్లు వేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు, తన వెన్నంటి నిలిచిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.